క్లుప్తంగా

అకడమిక్‌ క్యాలెండర్లను తీసుకెళ్లాలి

కడప ఎడ్యుకేషన్‌ : జిల్లా వ్యాప్తంగా 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన అకడమిక్‌ క్యాలెండర్లు కడప డీసీఈబీ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. సంబంధిత అకడమిక్‌ క్యాలెండర్లను జిల్లాలోని అన్ని మండలాల ఎంఈఓలు కార్యాలయ సిబ్బందిని పంపి తీసుకెళ్లాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు వేరువేరుగా పాఠశాలకు ఒక్కొక్కటి చొప్పున మీ మండలంలోని పాఠశాలల సంఖ్యను బట్టి అందచేస్తామని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో అన్ని పాఠశాలల్లో ఉండేటట్లు ఎంఈఓలు చూడాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు.

కార్మిక పరిషత్‌ నూతన గ్యారేజీ కమిటీ ఎన్నిక

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఆంధ్రప్రదేశ్‌ పీటీడీ కార్మిక పరిషత్‌ కడప డిపో గ్యారేజీ కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రీజినల్‌ కార్యదర్శి పురుషోత్తం తెలిపారు. గ్యారేజీ కార్యదర్శిగా ఖాజాపీర్‌, అధ్యక్షులుగా లూతురాజు, చైర్మన్‌గా యానాదిరాజు, అసిస్టెంట్‌ సెక్రటరీగా రవీంద్రారెడ్డి, కోశాధికారిగా శాంతప్ప, జాయింట్‌ సెక్రటరీగా వీవీ రమణ, పబ్లిసిటీ సెక్రటరీగా రాజు, డీబీఎస్‌ నాయక్‌లను ఎన్నుకున్నారు. వీరిని కడప డిపో మేనేజర్‌ డిల్లీశ్వర్‌ రావుకు పరిచయం చేశారు.

వేతనాలు పెంచాలని ఎమ్మెల్సీకి వినతి

కడప ఎడ్యుకేషన్‌ : జిల్లాలో అతి తక్కువ వేతనాలతో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న తమకు వేతనాల పెంపునకు కృషి చేయాలని పార్ట్‌టైమ్‌ డ్రాయింగ్‌ అండ్‌ క్రాఫ్ట్‌, పీఈటీ అసోసియేషన్‌ రాష్ట్ర నాయకులు యోహాన్‌, చిన్న వెంకటయ్యలు కోరారు. ఈ విషయమై శనివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యంవీ రామచంద్రారెడ్డిని కడపలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్సీ త్వరలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి సమస్య వివరిస్తానన్నారు.

హస్తకళల ఖ్యాతిని ప్రపంచానికి చాటుదాం

కడప కల్చరల్‌ : భారతీయ హస్తకళల ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా సూచించారు. కళాభారతి హస్తకళలు, చేనేత కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం కడప నగరంలోని నేక్‌నామ్‌ఖాన్‌ కళాక్షేత్రంలో హస్తకళలు, చేనేత వస్త్రాల ప్రదర్శన, విక్రయాల స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయ వస్త్రాలు, హస్తకళలకు నాణ్యత విషయంలో మంచి పేరుందని, విదేశీయులు మన కళారూపాలను ఎంతో మెచ్చుకున్నారన్నారు. తెలుగునాట నైపుణ్యం గల హస్తకళాకారులు స్వయంగా రూపొందించిన కళారూపాలు, చేనేత వస్త్రాలను నగర వాసులకు అందుబాటులోకి తెచ్చేందుకు మేనేజర్‌ సత్యం ఆధ్వర్యంలో కళాభారతి సంస్థ ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసిందని తెలిపారు. నగర వాసులు ఆదరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన అన్ని స్టాల్స్‌ను తిలకించి తయారీ విధానం, ముడిసరుకు, సేకరణ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షఫీ, అజంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలి

చెన్నూరు : ఖరీఫ్‌–2023లో వేసిన పంటలకు రైతులు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి తెలిపారు. శనివారం ఆమె చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ పంట నమోదు కార్యక్రమాన్ని ఇప్పటికే మండలంలో వ్యవసాయ సిబ్బంది ప్రారంభించారన్నారు. ఇప్పటివరకు 1200 ఎకరాలలో వరి, అలాగే ఇతర పంటలు రైతులు సాగు చేశారన్నారు. పంట వేసిన రైతులు తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించి ఈ పంట నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఆర్‌బీకేల్లో ఎరువులను అందుబాటులో ఉంచాలి

సిద్దవటం : మండలంలోని రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జిలు ఆర్‌బీకేల్లో ఎరువులను అందుబాటులో ఉంచాలని బద్వేల్‌ ఏడీఏ నాగరాజు సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో శని వారం ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి, ఆర్బీకే సహాయకులకు శిక్షణా, సమీక్షా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచుపల్లె రైతు భరోసా కేంద్రంలో 200 బస్తాలు డీఏపీ ఉందన్నారు. ఈ– పంట నమోదును ఎటువంటి తప్పిదాలు లేకుండా నిర్వహించాలన్నారు. వ్యవసాయాధికారి మాధురి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె: మండలంలోని అప్పరాజుపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో మొదటి శ్రావణ శనివారం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బండలాగుడు పోటీలు : మొదటి శ్రావణ శనివారం సందర్భంగా అప్పరాజుపల్లెలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణంలో వృషభరాజములతో బండలాగుడు పోటీలను నిర్వహించారు.

జగనన్న సారథ్యంలో జనరంజక పాలన

ఉప ముఖ్యమంత్రి ఎస్‌.బి.అంజాద్‌ బాషా



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప, కార్పొరేషన్‌ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డి సారథ్యంలో జనరంజక పాలన జరుగుతోందని, ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను అందించడం జరుగుతోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌.బి. అంజాద్‌బాషా అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా.. 27/1 వ డివిజన్‌ గౌస్‌ నగర్‌ సచివాలయం–2 లోని గౌస్‌ నగర్‌, రహమతీయ హాల్‌ వెనుక వీధుల వద్ద గల పలు ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు... స్థానిక కార్పొరేటర్‌, నాయకులు, అధికారులతో కలిసి.. ఆయా వీధుల్లో నివాసాలన్నింటి వద్దకు తిరిగారు. ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, ప్రతి కుటుంబానికి జరిగిన లబ్ధి సమాచారంతో కూడిన ముఖ్యమంత్రి సంతకం చేసిన బుక్‌లెట్‌ను అందజేశారు.

ఈ కార్యక్రమంలో పలువురు తమ సమస్యలను అంజాద్‌ బాషా దృష్టికి తీసుకురాగా.. వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆయన ఆదేశించారు. షేక్‌ రఫీవున్నిసా బేగం అనే మహిళ తనకు వైఎస్‌ఆర్‌ రైతు భరోసా, వైఎస్‌ఆర్‌ పింఛన్‌ కానుక, జగనన్న అమ్మ ఒడి, వైఎస్‌ఆర్‌ సున్నా వడ్డీ, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.10,68,500 లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. ఇన్ని సంక్షేమ పథకాలు ఏ ప్రభుత్వం లో మాకు అందలేదని ఇలాంటి ముఖ్యమంత్రి కి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 27వ డివిజన్‌ కార్పొరేటర్‌ ఎస్‌. ఆరీఫ్‌, కో ఆప్షన్‌ సభ్యుడు ఎస్‌ఎండీ జహీర్‌, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శివప్రసాద్‌, బీహెచ్‌ ఇలియాస్‌, బంగారు నాగయ్యయాదవ్‌, తోటక్రిష్ణ, త్యాగరాజు, షఫీ, పవర్‌ అల్తాఫ్‌, మున్నా, సంపత్‌, సునీల్‌, రామమోహన్‌రెడ్డి, టి.పీ సుబ్బమ్మ, మూలే సరస్వతి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ సరఫరా



నానాపల్లె విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప ప్రజలకు, శివారు ప్రాంతాల్లోని గ్రామీణ రైతులకు నాణ్యమైన నిరంతర విద్యుత్‌ సరఫరా అందివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. శనివారం 2వ డివిజన్‌లోని నానాపల్లెలో రూ.4కోట్లతో ఏర్పాటు చేసిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కేవలం మూడు నెలల్లోనే విద్యుత్‌ ఉప కేంద్రం నిర్మాణం పూర్తి చేసి నిర్వహణలోకి తీసుకురావడం జరిగిందన్నారు. నానాపల్లె ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, ఈ ప్రాంత ప్రజలకు ఈ సబ్‌స్టేషన్‌ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నానాపల్లె పక్కనున్న జగనన్న కాలనీల్లో 5వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చామని, అక్కడ గృహాలన్నీ పూర్తయితే ఓ పట్టణం తయారవుతుందన్నారు. ఇక్కడి గృహావసరాలు, వ్యవసాయ సర్వీసులను దృష్టిలో ఉంచుకొని ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నగరంలో మరో పది చోట్ల సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో ఐదింటికి స్థల సేకరణ పూర్తయ్యిందని, మిగతా వాటికి స్థల సేకరణ చేస్తున్నామన్నారు. అనంతరం విద్యుత్‌ ఉప కేంద్రంలో డిప్యూటీ సీఎం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్‌ పర్యవేక్షక ఇంజినీరు ఎస్‌. రమణ, ఈఈ చక్రవర్తి, ఈఈ ఆపరేషన్స్‌ ఎల్‌. నరసింహప్రసాద్‌, కార్పొరేటర్లు ఆర్‌. చెన్నయ్య, ఎం. సుబ్బారెడ్డి, షఫీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరుమంజన సేవ



గ్రామోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత కడప రాయుడు

కడప కల్చరల్‌ : దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసంలో వచ్చిన తొలి శనివారాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లను అలంకరించి తిరుచ్చి వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మవారి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రాకారోత్సవం, మంగళ హారతులు, ప్రసాద వినియోగం నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్‌ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో దేవతామూర్తులను పల్లకీలో కొలువుదీర్చారు. అర్చకులు త్రివిక్రమ్‌, సాయి మాడవీధుల్లో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు చేపట్టారు. తమ ఇళ్ల వద్దకే తరలివచ్చిన దేవతా మూర్తులను మనసారా దర్శించుకున్న స్థానిక భక్తులు పూజా ద్రవ్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు హారతులు ఇచ్చి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

దేవాలయాల్లో శ్రావణమాస పూజలు



శ్రావణమాసోత్సవ అలంకారంలో శ్రీ పాలకొండ్రాయస్వామి



శ్రీ రాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో విశేష అలంకారంలో శ్రీ వీరాంజనేయస్వామి

కడప కల్చరల్‌ : శ్రావణమాసం తొలి శనివారం సందర్భంగా కడప నగరంలోని దాదాపు అన్ని వైష్ణవాలయాల్లో ఉదయం 4 గంటల నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. తొలుత మూల మూర్తులకు పంచామృతాభిషేకం, అనంతరం కనుల పండువైన అలంకారం చేసి భక్తులను దర్శనాలకు అనుమతించారు. స్థానిక శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోనూ, వీరాంజనేయస్వామికి అర్చకులు రఘువీర్‌శర్మ రంగురంగుల పుష్పమాలలతో అలంకారం చేశారు. శ్రీవల్లీ దళాలతో అర్చన నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

■ నగర శివార్లలోని శ్రీ పాలకొండ్రాయస్వామి ఆలయంలో కడప గ్రూప్‌ ఆఫ్‌ టెంపుల్స్‌ ఈఓ ఎ.శ్రీధర్‌ పర్యవేక్షణలో అర్చక బృందం స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అలంకారం చేశారు. శ్రావణమాసంలో తొలి శనివారం కావడంతో భక్తులు విశేష సంఖ్యలో పూజోత్సవాలకు హాజరయ్యారు. ఆలయానికి వెళ్లేదారిలో ఆర్చి వద్దగల తొలి పాదాల సమీపంలో ఇందిరానగర్‌కు చెందిన శ్రీ బాలాజీ ఛారిటబుల్‌ ట్రస్టు చైర్మన్‌ ఏటూరి రామచంద్రారెడ్డి బృందం భక్తులకు అన్నదానం చేశారు.

నిర్మాణ వ్యర్థాలను శాస్త్రీయంగా శుద్ధి చేస్తాం



నిర్మాణ వ్యర్థాలను ట్రాక్టర్లలో తరలిస్తున్న దృశ్యం

కడప కార్పొరేషన్‌ : కడప నగరంలో నిర్మాణాల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను శాస్త్రీయంగా శుద్ధి చేసి, తిరిగి వాడుకునే పదార్థాలుగా మార్చడం జరుగుతుందని డిప్యూటీ సిటీ ప్లానర్‌ సూరజ్‌ కుమార్‌ అన్నారు. శనివారం కాగితాలపెంట, చిలకలబావి, సైనిక్‌ నగర్‌లలో ప్రత్యేక డ్రైవ్‌ చేపట్టి 45 మెట్రిక్‌ టన్నుల వ్యర్థాలను ఎంపిక చేసిన ప్రదేశానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ వ్యర్థాల నుంచి ఉత్పత్తి అయ్యే సూక్ష్మ కణాలు గాలి, భూగర్భ జలాల్లో కలిసి వాతావరణ కాలుష్యం కలిగిస్తున్నాయని, ఇది అంతిమంగా ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారుతోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి శనివారం ప్రత్యేక డ్రైవ్‌ చేపట్టి ఆ వ్యర్థాలను ట్రీట్‌మెంట్‌ ప్లాంట్‌కు తరలించి శాస్త్రీయ పద్ధతిలో శుద్ధి చేసి తిరిగి వాడుకునే పదార్థాలుగా మార్చడం జరుగుతుందన్నారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా నిర్మాణ వ్యర్థాలు గమనిస్తే స్థానిక వార్డు సచివాలయంలో తెలపాలన్నారు. ఈ ప్రక్రియ వల్ల నగరంలో కాలుష్యం తగ్గి ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందన్నారు.

వైవీయూ కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌. రఘునాథరెడ్డి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం వైవీయూ ప్లేస్‌మెంట్‌ సెల్‌ ఆధ్వర్యంలో దివిస్‌ ల్యాబొరేటరీ సంస్థ ఆధ్వర్యంలో క్యాంపస్‌ డ్రైవ్‌ నిర్వహించారు. అకడమిక్‌ అఫైర్స్‌ డీన్‌ ఆచార్య ఏజీ దాము మాట్లాడుతూ దివిస్‌ ల్యాబొరేటరీ సంస్థ ఎంపికలకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. దివిస్‌ సంస్థ హెచ్‌ఆర్‌ విభాగం ప్రతినిధులు రవి, నవీన్‌లు మాట్లాడుతూ సంస్థలో ఉద్యోగం చేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఫలితాలను తర్వాత విడుదల చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఆచార్య ఎల్‌. వీరాంజనేయరెడ్డి, సహ ఆచార్యులు డా. టి. చంద్రశేఖర్‌, డా. మాధవరెడ్డి, మైక్రోబయాలజీ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధమైన సాధనతో విజయం



కెరీర్‌ గైడెన్స్‌ పుస్తకాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్‌ డా. జి. రవీంద్రనాథ్‌

వైవీయూ : ప్రణాళికబద్ధమైన సాధనతో విజయం సొంతం చేసుకోవచ్చని స్టెప్‌ సీఈఓ సి. సాయిగ్రేస్‌ పేర్కొన్నారు. శనివారం కడపలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఏపీ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో కెరీర్‌ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టెప్‌ సీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు ఎలా వేసుకోవాలో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ డా. జి. రవీంద్రనాథ్‌ మాట్లాడుతూ ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త డా. ప్రశాంతి మాట్లాడుతూ యువత ముందున్న లక్ష్యాలను, కెరీర్‌ గైడెన్స్‌ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు కెరీర్‌ గైడెన్స్‌ పుస్తకాలను అందజేశారు. ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ డా. వై. సావిత్రి, డా. పి. రవిశేఖర్‌, అనిత, నాగేంద్రకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

తరాలకు వారధులు ఫొటోగ్రాఫర్లు



ఫొటోగ్రాఫర్లను సత్కరిస్తున్న లయన్స్‌, ఇంటాక్‌, రాయలసీమ సంస్థల ప్రతినిధులు

కడప కల్చరల్‌ : ఫొటోగ్రాఫర్లు రెండు తరాలకు వారధులుగా నిలుస్తున్నారని ఇంటాక్‌ జిల్లా చాప్టర్‌ కన్వీనర్‌ కె.చిన్నపరెడ్డి, లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి అన్నారు. రాయలసీమ టూరిజం అండ్‌ కల్చరల్‌ సొసైటీతో కలిసి శనివారం పాత కలెక్టరేట్‌లోని ఇంటాక్‌ కార్యాలయంలో ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రముఖ ఫొటోగ్రాఫర్లు గొబ్బూరి కోటేశ్వరరావు, రాష్ట్ర వీడియో అండ్‌ ఫొటోగ్రాఫర్స్‌ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు పద్మప్రియ చంద్రారెడ్డి, రాము స్టూడియో సురేష్‌, చింతకుంట కన్యక పుల్లయ్య, వల్లూరు శివయ్య, ఫొటో టెక్నీషియన్‌ యల్లేశ్వరరావు, నారు నాగరాజ, నిత్యపూజయ్యలను సత్కరించారు. సంస్థల సభ్యులు రిటైర్డ్‌ బ్యాంకు అధికారి శైలేంద్ర, లయన్స్‌ పూర్వ అధ్యక్షులు డాక్టర్‌ ఆర్‌.రంగనాథరెడ్డి, కొండూరు జనార్దన్‌రాజు పాల్గొన్నారు.

50వ డివిజన్‌లో కమిషనర్‌ పర్యటన



పాలెంపల్లెలో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్‌ ప్రవీణ్‌చంద్‌

కడప కార్పొరేషన్‌ : కడప నగరంలోని 50వ డివిజన్‌ పాలెంపల్లెలో మున్సిపల్‌ కమిషనర్‌ ప్రవీణ్‌చంద్‌ పర్యటించారు. మార్నింగ్‌ విజిట్‌లో భాగంగా ఆయన స్థానిక వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ సెక్రటరీలు ప్రజలకు ఎలా సేవలందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆ సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 50వ డివిజన్‌ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కె. రాజశేఖర్‌రెడ్డి, డీఈ అబిద్‌ హుస్సేన్‌, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్‌ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కడప ఎడ్యుకేషన్‌ : సైబర్‌ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండటంతోపాటు సోషియల్‌ మీడియాలో వచ్చే ప్రకటనలకు స్పందించి వ్యక్తి గత వివరాలను చెప్పకూడదని మౌలానా ఆజాద్‌ నేషనల్‌ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్‌ కళాశాల పోగ్రాం కోఆర్డినేటర్‌, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ మొహమ్మద్‌ సికిందర్‌ హుస్సేన్‌ అన్నారు. నగరంలోని కడప ఇస్లామిక్‌ వెల్ఫేర్‌ సొసైటీ ఆధ్వర్యంలో జమాత్‌ ఉస్‌ సలిహత్‌ మదరసా విద్యార్థులకు, సిబ్బందికి సైబర్‌ క్రైమ్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మొహమ్మద్‌ సికిందర్‌ హుస్సేన్‌ మాట్లాడుతూ మనకు తెలియని వాళ్లు వీడియోకాల్‌ చేస్తే లిఫ్ట్‌ చేయకూడదన్నారు. సెల్‌ఫోన్‌లకు మెసేజ్‌కానీ లింక్‌కానీ వస్తే దానిపై క్లిక్‌ చేయకూడదన్నారు. సైబర్‌ నేరాల వల్ల నష్టపోయిన బాధితులు 1930కి ఫోన్‌ కాల్‌ చేయాలని, మీ దగ్గరలోని సైబర్‌క్రైం ఆఫీసులో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మదరసా ప్రతినిధులు మెహమ్మద్‌ షరీఫ్‌, సొసైటీ సభ్యులు ముక్తర్‌ అహ్మద్‌, ఇషాఖ్‌అలీ, అహ్మద్‌ బాషా, హిదయతుల్లాహ్‌, అబ్దుల్‌ జబ్బార్‌ పాల్గొన్నారు.

తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వాలి



హాజరుపట్టిని పరిశీలిస్తున్న అధికారభాష సంఘం సభ్యులు డాక్టర్‌ తవ్వా వెంకటయ్య

కడప కల్చరల్‌ : ఆంధ్ర ప్రదేశ్‌ అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్‌ తవ్వా వెంకటయ్య శనివారం పెండ్లిమర్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. తెలుగు రిజిష్టర్లు, సెలవు లేఖలు తెలుగులోనే రాసేలా చర్యలు చేపట్టాలని ప్రధాన ఆచార్యులకు తెలిపారు. కళాశాల విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలు ఆంగ్లంలో ఉండటాన్ని గమనించి వచ్చేనెల నుంచి తప్పక తెలుగులోనే రాయాలని సూచించారు. ఈ సందర్భంగా డిగ్రీ సెమిస్టర్‌ పరీక్షల్లో తెలుగుభాష అమలు గురించి డాక్టర్‌ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ త్వరలో డిగ్రీలో నాలుగు సెమిస్టర్లలో తెలుగు ఉండేలా అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయ్‌బాబు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

స్కూల్‌ గేమ్స్‌ కార్యాలయం ఏర్పాటు

మైదుకూరు : జిల్లా స్కూల్‌ గేమ్స్‌ కార్యాలయానికి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని మొదటి అంతస్తులో ఓ గదిని కేటాయిస్తామని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. మైదుకూరులో స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో రెండో రోజు శనివారం నిర్వహించిన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మొదటి అంతస్తులో ఉన్న గదిలో స్కూల్‌ గేమ్స్‌ కార్యకలాపాలు నిర్వహించుకోవాలని తెలిపారు. ఇంకా అవసరమైన వసతుల కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు తాను సిద్ధమని తెలిపారు. జిల్లా బాలికల జట్ల వెంట క్రీడా పోటీలకు మహిళా ఉపాధ్యాయులు తప్పకుండా వెళ్లాలని ఆదేశించారు. ప్రతి ఎంపికలు ప్రత్యేకమైన కమిటీల ద్వారానే జరగాలన్నారు. జిల్లా స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ కార్యదర్శి అరుణకుమారి మాట్లాడుతూ మండలస్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు ఉంటాయని అందు కోసం ప్రతి వ్యాయామ ఉపాధ్యాయుడు క్రీడాకారులను సిద్ధం చేయాలని సూచించారు. డీఈఓ ఆదేశాలతో త్వరలోనే స్కూల్‌ గేమ్స్‌ షెడ్యూల్‌ను విడుదల చేస్తామని తెలిపారు. సమావేశంలో స్కూల్‌ గేమ్స్‌ మాజీ కార్యదర్శి డీవీ కొండారెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌ కిరణ్‌, మేధా డిఫెన్స్‌ అకాడమీ చైర్మన్‌ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చింతకొమ్మదిన్నె : రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొప్పర్తి పంచాయతీ పరిధిలోని ఎర్రమాచుపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అభివృద్ధి.. సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్‌ గూడ ప్రభాకర్‌ రెడ్డి, కో–కన్వీనర్‌ కళాయాదవ్‌, మాజీ కన్వీనర్‌ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఈడిగ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ కృష్ణయ్య, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌ రెడ్డి, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, నాగరాజు, సర్పంచులు సురేంద్రారెడ్డి, కోకటం లక్ష్మీనారాయణరెడ్డి, సింగిల్‌ విండో అధ్యక్షులు రాజారెడ్డి, గజ్జల శ్రీరామిరెడ్డి, నాయకులు ఓబుల్‌రెడ్డి, నాగమల్లా రెడ్డి, వేణుగోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయం వద్ద నిరసన

కడప ఎడ్యుకేషన్‌ : ఉపాధ్యాయుల పని సర్దుబాటును తక్షణమే ఆపాలని, అలాగే బదిలీ, పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల వేతనాలను తక్షణం చెల్లించాలని ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు, యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా డిమాండ్‌ చేశారు. పనిసర్దుబాటు ఆపడంతోపాటు జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్‌ చేస్తూ శనివారం సాయంత్రం డీఈఓ కార్యాలయం వద్ద ఫ్యాప్టో జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఫ్యాప్టో జిల్లా ట్రెజరర్‌ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 23న పాఠశాల విద్య డైరెక్టరేట్‌ వద్ద 12 గంటల ధర్నాను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, యూటీఎఫ్‌ ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, ఏపీటీఎఫ్‌ రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యులు అబ్దుల్లా, బీటీఏ జిల్లా కార్యదర్శి హరికొండయ్య తదితరులు పాల్గొన్నారు.





